# కోతి - మొసలి



ఒక అడవిలో బలివర్ధనుడనే కోతి ఒకటి తన అనుచరులతో ఉంటూ ఉండగా దగ్గరలోనే ఉన్న ఇంకో కోతుల మందకు నాయకుడైన కపీశ్వరుడు అనే కోతి తన అనుచరులతో దాని మీదకు యుద్ధానికి వచ్చి దానిని ఓడించి తరిమివేసింది. బలివర్ధనుడు ఇక చేసేది యేమీ లేక అక్కడనుంచి చాలా దూరంగా ఉన్న ఒక నది గట్టు మీద పళ్ళతో నిండి ఉన్న ఒక చెట్టు మీదకు చేరి హాయిగా ఆ పళ్ళు తింటూ కాలం గడుపుతూ ఉంది.

ఒక రోజు అట్లాగే పళ్ళు తింటూ ఉండగా ఒక పండు జారి కింద నదిలో పడింది. ఆ దగ్గరలోనే తిరుగుతున్న మొసలి ఒకటి , యేమిటి ఈ చప్పుడు అనుకుంటూ అక్కడకు వచ్చి చెట్టు మీద పళ్ళు తింటున్న కోతిని చూసి "ఓ స్నేహితుడా కింద ఉన్న నన్ను వదిలి నువ్వు ఒక్కడివే అంత తియ్యటి పళ్ళను తినటం నీకు న్యాయంగా ఉందా" అంది. బలివర్ధనుడు ఆ మాటలకు ఆశ్చర్యంతో కిందకు చూసి మొసలి అడుగుతోంది అని తెలుసుకుని ఇంత కాలానికి ఒక స్నేహితుడు దొరికాడు గదా అని యెంతో సంతోష పడి మరిన్ని పళ్ళను తెంపి కిందకు పడేసింది.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఆ పళ్ళను తింటూ మొసలి సాయంత్రం దాకా అక్కడే ఉండి రాత్రికి తన ఇంటికి వెళ్ళింది.

ఇట్లా ప్రతిరోజూ పొద్దున్నే వచ్చి సాయంత్రం దాకా బలివర్ధనుడి తో కబుర్లు చెప్పుకుంటూ పళ్ళు తింటూ రాత్రికి ఇంటికి వెడుతూ ఉండేది. ఆ మాదిరిగా కొన్ని రోజులు గడిచేటప్పటికి ఆ మొసలి భార్య యేమిటి ఈయన కొద్ది రోజులుగా పగలంతా ఇంటికి రాకుండా యెక్కడెక్కడో తిరుగుతున్నాడు అని అనుమానమొచ్చి తన స్నేహితురాలిని పిలిచి ఈయన పగలంతా ఇంటికి రావటంలేదు కాస్త యెక్కడ తిరుగుతున్నాడో చూసి నాకు చెప్పవా అని బతిమాలింది.

ఆ స్నేహితురాలు అట్లాగే అని చెప్పి మరుసటిరోజు ఆ స్నేహితురాలి భర్తను అనుసరించి వెళ్ళి అది ఒక కోతి తో స్నేహంగా ఉండటం ఆ కోతి తో కబుర్లు చెప్తూ ఆ కోతి చెట్టుపైనుంచి పడవేసే పళ్ళను తింటూ కాలక్షేపం చెయ్యడం చూసి తిరిగి వచ్చి తన స్నేహితురాలితో ఉన్నవీ లేనివీ కల్పించి నీ ప్రియుడు ఆ నది ఒడ్డున ఉన్న చెట్టు మీద ఒక అందమైన కోతి తో సరసాలు ఆడుతూ అది పెట్టే పళ్ళు తింటూ అక్కడే కాలక్షేపం చేస్తున్నాడు. నువ్వు యెట్లాగైనా అతనిని ఆ కోతిని కలియకుండా చెయ్యాలి అని చెప్పింది.

ఆ మొసలి భార్య ఇదంతా విని విచారంతో ఉండగా ఇదే మీ తెలియని ఆ మొసలి తన భార్య మీద ప్రేమతో ఆ కోతిని అడిగి కొన్ని పళ్ళను తీసుకొని ఇంటికి వచ్చి విచారంగాను, దీనంగాను ఉన్న భార్యను చూసి "యేమైంది అంత విచారంగా ఉన్నావు, నీ బాధ యేమిటో చెప్పు నీ కోర్కె యేదైనా నేను తీరుస్తాను" అనగా అందుకు యేమీ సమాధానం చెప్పకుండా తన చెలికత్తె వంక నువ్వు చెప్పు అన్నట్లుగా చూసింది.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఇదే అదను అనుకొని ఆ చెలికత్తె "యేమి చెప్పమంటారు ప్రభూ పొద్దుటి నించీ ఆమెకు ఒకటే తల నొప్పి యెన్ని సపర్యలు చేసినా తగ్గటంలేదు. వైద్యుడిని తీసుకొచ్చి చూపిస్తే యెన్ని మందులు వాడినా లాభం లేక చివరకు వైద్యుడు ఒక్కటే మందు ఉంది అది వేస్తే గాని ఈపిడ తలనొప్పి తగ్గదు. ఇట్లాగే కొన్ని రోజులు ఉంటే ఈపిడ చనిపోతుంది" అన్నాడు. అది యేమిటి అని అడిగితే "కోతి గుండె కాయ తెచ్చి దానితో మందు తయారు చేసి వేస్తే తగ్గుతుంది" అని చెప్పాడు. ఇప్పుడు కోతి గుండె కాయ యెట్లా వస్తుంది" అంది.

ఆ మొసలి కొంత సేపు ఆలోచించి సరే నేను ప్రయత్నం చేస్తాను అని చెప్పి బయలుదేరి తన మిత్రుడైన కోతి వద్దకు చేరి విచారంగా మొహం పెట్టి "మిత్రమా నువ్వు ఇచ్చిన పళ్ళు తీసుకెళ్ళి నా భార్యకు ఇస్తే తిని ఇంత చక్కటి పళ్ళు నీకు ఇచ్చిన నీ మిత్రుడిని మన ఇంటికి తీసుకొస్తే మనం కూడా చక్కటి విందు భోజనం పెట్ట వచ్చుగా ఆ మాత్రం కూడా నీకు తెలియదా" అని కోపగించుకొంది. మేమా నీళ్ళల్లో ఉండే వాళ్ళం నువ్వా నేల మీద చెట్ల మీద ఉండే వాడవు నిన్ను యెట్లా తీసుకెళ్ళాలో అర్ధం కావడంలేదు అంది.

అందుకు బలివర్ధనుడు దీనికోసం అంత బాధ యెందుకు నేను నీ వీపు మీద కూచుని వస్తాను తీసుకెళ్ళు అట్లాగే మళ్ళీ తిరిగి తీసుకొచ్చి ఇక్కడ దింపుదువు గాని. నేను వస్తాను పద అని కొన్ని బాగా పండిన పళ్ళను కోసుకుని కిందకు వచ్చి ఆ మొసలి వీపు మీద కూర్చుని పద వెడదాం అంది.

మొసలి నెమ్మదిగా ఈదుకుంటూ ఇంటికి వెడుతూ "అయ్యో ఇంత మంచి స్నేహితుడిని అబద్ధాలతో మోసగించి ఇంటికి తీసుకు వెడుతున్నాను కదా నేను యెంత పాపం చేస్తున్నాను భార్యను బతికించుకొవడానికి ఇంత

PDF created with pdfFactory trial version www.pdffactory.com

పాపం చెయ్యాలా" అని లోపల్లోపలే అనుకుంటూ ఈదుకుంటూ వెళ్ళ సాగింది.

బలివర్ధనుడు యేమిటి ఇంత నెమ్మదిగా వెడుతున్నావు ఇంటికి నన్ను తీసుకు వెళ్ళటం నీకు ఇష్టం లేదా అని అడగగా "అయ్యో అదేమి లేదు ఎందుకో నా మనసు బాగా లేదు" అంది ఆ మొసలి. అందుకు బలివర్ధనుడు అదేమిటి నీ భార్య కోరిక తీరుస్తున్నావు అందుకు సంతోష పడాలి గాని మనసు బాగుండటం లేదు అంటావేమిటి అంది.

ఇంత దూరం వచ్చింతర్వాత ఇంకా యెక్కడికి వెడుతుందిలే అనే ధైర్యం తోను, ఇంకా అబద్ధాలు చెప్పేందుకు మనసు ఒప్పక ఆ మొసలి "నా విచారమంతా నీతో అబద్ధాలు చెప్పాల్సి వచ్చినందుకు. అసలు సంగతి యేమిటంటే నా భార్యకు జబ్బుగా ఉంది, ఆ జబ్బుకు మందు కోతి గుండెకాయతో తయారు చేసిన మందు అందుకని నిన్ను తీసుకు వెడుతున్నాను" అనగా బలివర్ధనుడు కొంచెం ఖంగారు పడి అంతలోనే తమాయించుకొని "ఓరి పిచ్చి స్నేహితుడా ఈ సంగతి ముందే చెప్పితే బాగుండేది కదా, నేను ముసలితనంతో నా గుండె బరువు మొయ్య లేక బయటకు తీసి ఆ చెట్టు కొమ్మకు వేళ్ళాడతీసి తిరుగుతున్నాను, దానిని తీసుకు వచ్చేవాడిని ఐనా ఇప్పుడు ఇంకా సమయం మించి పోలేదు, మళ్ళీ వెనక్కు వెళ్ళి తీసుకుని వద్దాం పద" అంది.

మొసలి ఆ మాటలు నమ్మి వెనక్కు తిరిగి చెట్టు దగ్గరకు వచ్చి "మిత్రమా తొందరగా వెళ్ళి ఆ గుండెను తీసుకుని రా, మనం మా ఇంటికి వెళ్ళి నా భార్య జబ్బు నయం చెసుకుందాం" అంది. చెట్టు దగ్గరకు రాగానే బలివర్ధనుడు ఒక్క సారిగా యెగిరి గట్టు మీదకు వెళ్ళి అక్కడనుంచి చెట్టు యెక్కి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు గండం తప్పింది కదా అని.

PDF created with pdfFactory trial version www.pdffactory.com

యెంత సేపటికి తన స్నేహితుడు తిరిగి కిందకు రాకపోవటం చూసి మొసలి "మిత్రమా తొందరగా వస్తే ఇంటికి పెడదాం రా" అంది. అందుకు బలివర్ధనుడు "ఓసి పిచ్చి దానా యెవరన్నా గుండెను పిడిగా తీసి పెట్టుకుని బతకగలరా, ఇక మన స్నేహం చాలు ఇంటికి పో, ఇంత స్నేహం నటిస్తూ నన్ను చంపటానికి చూస్తావా, సిగ్గులేదూ ఫో ఫో" అంది. అట్లా ఆ తెలివి తక్కువ మొసలినుంచి బలివర్ధనుడు తన ప్రాణం రక్షించుకున్నాడు.

## పిల్లలూ మరి ఈ కధ లోని నీతి యేమిటి ?
## క్రూర మయిన వారిని ఎన్నటికీ నమ్మరాదు.

Keywords: Telugu Chinna Pillala Kathalu, Pillala Neeti Kadhalu, Telugu lo chinna pillala kosam neeti kathalu, telugu short stories, kids stories in telugu, mosali kOti katha, mosali, kOti, kOti gunDekAya, mosali markaTam kadha, jataka kathalu, jataka kadhalu.

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org

PDF created with pdfFactory trial version www.pdffactory.com